గిట్టుబాటుకాని జీడిపప్పు ధర

- అయోమయంలో వ్యాపారులు
- భారీగా పెరిగిన గింజల ధర
- కిలో పప్పు ధర రూ.720

దేవరపల్లి: మూఢం దాటినా జీడిపప్పుకు డిమాండ్ లేకపోవడంతో వ్యాపారులు డీలా పడ్డారు. ఒక పక్క గింజల ధర భారీగా పెరగడం, పప్పు ధర నిలకడగా ఉండడంతో నష్టం వస్తోందని వాపోతున్నారు. మొన్నటి వరకు ఆషాఢం, మూఢాల వల్ల శుభకార్యాలకు బ్రేక్ పడడంతో పప్పు కొనుగోళ్లు తగ్గాయని వ్యాపారులు తెలిపారు. అన్ని అడ్డంకులూ తొలగినప్పటికీ మార్కెట్ మందకొడిగానే ఉందని వ్యాపారులు తెలిపారు.

పెరిగిన గింజల ధర

జీడిగింజల ధర బస్తా (80 కిలోలు) రూ.13,500 నుంచి రూ.14, 000 పలుకుతున్నాయి. జూన్, జూలై నెలల్లో గింజల ధర రూ.11,500 నుంచి రూ.12000 పలికాయి. లోకల్ గింజలు బస్తా రూ.13,500 పలుకుతుండగా, విదేశీ గింజలు రూ.14,000 పలుకుతున్నట్టు వ్యాపారులు తెలిపారు. అయితే గింజలు నాణ్యతలేకపోవడంతో పప్పు మచ్చ వచ్చి వినియోగం తగ్గిందని వ్యాపారులు తెలిపారు. లోకల్ గింజల పప్పుపై నల్లని మచ్చలు రావడంతో కొనుగోలుదారులు ముందుకు రావడం లేదని వ్యాపారులు వివరించారు. విదేశీ గింజల పరిస్థితి కూడా అలాగే ఉందని, విదేశీ గింజల పప్పు కాయగుళ్లు (పప్పు పైపొర ఊడని) ఎక్కువగా రావడం వల్ల వినియోగదారులు ఆసక్తి చూపడంలేదని వ్యాపారులు వాపోతున్నారు. నూక ఎక్కువగా వస్తోంది. బస్తా గింజలకు 24 నుంచి 25 కిలోల పప్పు దిగుబడి రావలసి ఉండగా, 21 నుంచి 22 కిలోలు వస్తోందని వ్యాపారులు తెలిపారు. పప్పు కిలో ధర రూ.720 నుంచి 730 ఉండగా, నూక ధర రూ. 300 పలుకుతోంది. మార్కెట్ ఆశాజనకంగా లేకపోవడంతో చాలమంది వ్యాపారులు ఇప్పటికే పప్పు తయారీని నిలుపుదల చేశారు. సొంత ఫ్యాక్టరీలు ఉన్న వ్యాపారులు తప్పక పప్పు తయారు చేస్తున్నారు. చిత్తూరు, బెంగళూరు, హైదరాబాద్ వంటి పట్టణాల్లో పప్పుకు డిమాండ్ ఉన్నప్పటికీ ఈ ప్రాంతంలో తయారు చేసిన పప్పు నాణ్యత లేక కొనుగోలు చేయడంలేదని వ్యాపారులు తెలిపారు. ఇతర ప్రాంతాల్లో తయారైన పప్పుకు మంచి డిమాండ్ ఉందని వ్యాపారులు తెలిపారు. కొత్త పంట వచ్చే వరకూ వ్యాపారం చేయడం కష్టమని వ్యాపారులు అంటున్నారు. గోపాలపురం నియోజకవర్గంలోని దేవరపల్లి, నల్లజర్ల, దూబచర్ల, నిడదవోలు నియోజకవర్గంలోని తాడిమళ్ల, కొవ్వూరు నియోజకవర్గంలోని చాగల్లు, చిక్కాల ప్రాంతాల్లో తయారు చేస్తున్న పప్పుకు గిట్టుబాటు ధర రావడం లేదని వ్యాపారులు వాపోతున్నారు.



ఫ్యాక్టరీలో జీడిపప్పు గ్రేడింగ్ చేస్తున్న మహిళలు

కిలో రూ. 800 ధర ఉంటే గిట్టుబాటు



కిలో జీడిపప్పు ధర రూ. 800 ఉంటే గిట్టుబాటు అవుతుంది. గింజల ధర పెరిగినప్పటికి పప్పు ధర పెరగలేదు. ప్రస్తుతం పప్పు కిలో రూ.72 నుంచి 730 పలుకుతోంది. నాణ్యత దెబ్బతింది. పప్పుపై మచ్చలు రావడంతో కొనుగోలు దారులు ఆసక్తి చూపడం లేదు. పప్పు వ్యాపారం గిట్టుబాటు కావడం లేదు. కొత్త గింజలు అందుబాటులోకి వచ్చే వరకు మార్కెట్ ఇలాగే ఉంటుంది. చిన్నచిన్న వ్యాపారులు పప్పు తయారీ నిలుపుదల చేశారు. పలాస పప్పు మార్కెట్ బాగుంది.

– కొండపల్లి రమేష్‌బాబు, శ్రీవెంకటేశ్వర క్యాజూ మర్చంట్స్ అసోసియేషన్, దేవరపల్లి

దేవరపల్లిలో సేంద్రియ కూరగాయల స్టాల్



దేవరపల్లి గ్రామ సచివాలయం వద్ద ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను విక్రయిస్తున్న సిబ్బంది

దేవరపల్లి: సేంద్రియ వ్యవసాయ పద్ధతులను అందరూ ప్రోత్సహించాలని జిల్లా మార్కెటింగ్ ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ వరలక్ష్మి సూచించారు. సేంద్రియ వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయలు, ఆకుకూరల స్టాల్‌ను సోమవారం దేవరపల్లి గ్రామ సచివాలయం వద్ద ఏర్పాటు చేశారు. ఈ స్టాల్‌ను వరలక్ష్మి, డివిజన్ మాస్టరు ట్రైనర్ శ్రీనివాస్ సందర్శించారు. వరలక్ష్మి మాట్లాడుతూ సేంద్రియ విధానంలో పండించే ఆకుకూరలు, కూరగాయలు, వరి వంటి అన్నిరకాల ఆహార ఉత్పత్తులను ప్రజలకు అందిస్తున్నామన్నారు. శ్రీనివాస్ మాట్లాడుతూ క్రిమిసంహార రహిత ఆహార ఉత్పత్తులను వినియోగించడం ద్వారా ప్రజల జీవన ప్రమాణాలను మెరుగు పరచవచ్చన్నారు.

క్లుప్తంగా

మొక్కల పెంపకాన్ని ఉద్యమంలా చేపట్టాలి



గోపాలపురం పొగాకు బోర్డు ఆవరణలో మొక్క నాటిన సిబ్బంది

గోపాలపురం: పొగాకు బోర్డు పరిధిలోని రైతులు మొక్కల పెంపకాన్ని ఉద్యమంలా చేపట్టాలని గోపాలపురం పొగాకు వేలం నిర్వహణాధికారి అమూల్‌డీ శ్యామ్ పిలుపునిచ్చారు. స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా సోమవారం పొగాకు బోర్డు ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా అమూల్ డీ శ్యామ్ మాట్లాడుతూ ప్రతి రైతు తమ పంట పొలాల గట్లపై, కంచెలు, ఖాళీ ప్రదేశాల్లో విరివిగా మొక్కలు నాటాలన్నారు. ప్రతి ఒక్కరూ ఒక్కో మొక్కను నాటాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘ అధ్యక్షులు ఇల్లూరి రాంబాబు, పిన్నమనేని మధుమోహన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ కార్యాలయం ప్రారంభం

కొవ్వూరు: వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ కార్యాలయాన్ని స్థానిక సత్యవతీ నగర్‌లో మంగళవారం ఉదయం పది గంటలకు ప్రారంభించనున్నట్టు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలారి వెంకట్రావు సోమవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణు, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా, ఎమ్మెల్సీ కౌరు శ్రీనివాస్, పార్టీ పార్లమెంటరీ నియోజకవర్గం ఇన్‌చార్జ్ గూడూరి శ్రీనివాస్, నియోజకవర్గ పరిశీలకుడు ఎస్.రాజీవ్‌కృష్ణ ముఖ్య అతిథులుగా హాజరు కానున్నట్లు తెలిపారు. కావున నియోజకవర్గంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమానికి హాజరు కావాలని తలారి వెంకట్రావు కోరారు. అనంతరం తన పుట్టిన రోజు వేడుకలను నూతన కార్యాలయంలో నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు.

కుటుంబ సభ్యుల చెంతకు వృద్ధురాలు



గోపాలపురం పోలీస్ స్టేషన్‌లో వృద్ధురాలిని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు

గోపాలపురం: మతి స్థిమితం లేని వృద్ధురాలని భావించి ఆశ్రమంలో చేర్పించిన మానేపల్లి నాగమణి కుటుంబ సభ్యుల ఆచూకీని గోపాలపురం పోలీసులు కనుగొన్నారు. దాంతో పోలీసులు సోమవారం ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం అందించి ఆమెను వారికి అప్పగించారు. ఆమె ఆచంట మండలం కాపులపాలెంకు నివాసి అని స్థానిక ఎస్సై కర్రి సతీష్‌కుమార్ తెలిపారు. నాగమణికి ఎలాంటి ప్రమాదం జరగకుండా సపర్యలు చేసిన ఆశ్రమం యజమాని కాగిత భాస్కరరావుకు, గోపాలపురం ఎస్సైకు ఆమె కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

పాలంగి గ్రామంలో ఫీవర్ సర్వే

ఉండ్రాజవరం: దోమల వల్ల ప్రాణాంతక వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఉండ్రాజవరం పీహెచ్‌సీ వైద్యుడు ఆర్ఎస్ఎస్‌వీ ప్రసాద్ అన్నారు. మండలంలోని పాలంగి గ్రామంలోని 10,11 వార్డుల్లో సోమవారం ఆరోగ్య సిబ్బంది ఫీవర్ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా పాలంగి హెల్త్ క్లస్టర్ ఇన్‌చార్జ్ కాపా నాగరాజు ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి జ్వరంతో పాటు ఇతర వ్యాధుల గురించి అడిగి తెలుసు కున్నారు. రెండు వార్డుల్లో ఏవిధమైన జ్వరం కేసులు నమోదు కాలేదని నాగరాజు తెలిపారు.

చిత్ర లేఖనంలో వెలిగిన సువర్ణజ్యోతి



నిడదవోలు: చిత్రలేఖనం పోటీల్లో స్థానిక ఎస్వీఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల బీఎస్సీ సెకండియర్ విద్యార్థిని ఈ.సువర్ణజ్యోతి చక్కటి ప్రతిభ కనబరిచారు. జిల్లా స్థాయి యువజనోత్సవాల్లో భాగంగా రాజమహేంద్రవరం ఆదికవి నన్నయ యూనివర్సిటీలో నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో ఆమె ద్వితీయ స్థానం సాధించింది. ఈ సందర్భంగా విద్యార్థి సువర్ణజ్యోతిని సోమవారం ప్రిన్సిపాల్ డాక్టర్ ఓ. జ్యోతి, అధ్యాపకులు నాగేశ్వరరావు, హనుమంతరావు, స్రవంతి, జాస్మిన్‌లతో పాటు విద్యార్థులు అభినందించారు.

ప్రతి వారం 'పొలం పిలుస్తోంది'

పెరవలి: వారంలో ప్రతి మంగళ, బుధవారాలు మండలంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తామని మండల వ్యవసాయాధికారి మేరీ కిరణ్ సోమవారం తెలిపారు. రోజుకు రెండు గ్రామాల చొప్పున పంట చేల వద్ద రైతులకు అవగాహన కల్పించనున్నట్టు చెప్పారు. మంగళవారం కాకరపర్రు, పెరవలి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వారిద్దరినీ పదవుల నుంచి తొలగించాలి

రఘురామ, నానాజీలపై మాల సంఘాల జేఏసీ ఆగ్రహం



కొవ్వూరులో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న దళిత సంఘాల నాయకులు

కొవ్వూరు: ఎస్సీల పట్ల అనుచితంగా ప్రవర్తించిన ఉండి, కాకినాడ రూరల్ ఎమ్మెల్యేలు కనుమూరి రఘురామకృష్ణంరాజు, పంతం నానాజీలను తక్షణమే పదవులను తొలగించాలని మాల సంఘాల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ బొంతా శ్యాం రవిప్రకాశ్ డిమాండ్ చేశారు. బాధ్యతాయుతమైన రాజ్యాంగ పదవుల్లో ఉండి వీధి రౌడీల్లా ప్రవర్తించడం సిగ్గుచేటన్నారు. పలువురు ఎస్సీలు సోమవారం నల్ల రిబ్బన్‌లు ధరించి పట్టణంలోని క్రిస్టియన్‌పేట అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. రఘురామకృష్ణంరాజు క్రైస్తవులపై తప్పుడు వ్యాఖ్యలు చేస్తూ ఎస్సీ సర్టిఫికెట్లు రద్దు చేయిస్తానంటూ బెదిరించడం సిగ్గు చేట ని శ్యాం రవిప్రకాశ్ అన్నారు. బ్యాంకు రుణాలు ఎగ్గొట్టిన ఆర్థిక నేరగాడిని తక్షణం అరెస్ట్ చేయాలన్నారు. ఇద్దరు ఎమ్మెల్యేలూ నోరు అదుపులో పెట్టుకోకపోతే తీవ్ర పరిణామాలు ఎదు ర్కోవాల్సి ఉంటుందన్నారు.

ఖబడ్దార్ నానాజీ, రఘురామ..

పెరవలి: దళితుల ఆరాధ్య దైవమైన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫ్లెక్సీని చించివేసిన ఉండి ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజు, దళిత వైద్యునిపై దౌర్జన్యానికి పాల్పడిన కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీలు ఒళ్లు దగ్గర పెట్టుకుని నడుచుకోని పక్షంలో దళితులు ఆగ్రహానికి గురి కావలసి వస్తుందని సామాజికవేత్త చిర్రా గోపాల్ హెచ్చరించారు. పెరవలి మండలం నడుపల్లిలోని తన స్వగృహంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అధికారం ఉంది కదా అని ఇష్టం వచ్చినట్టు వ్యవహరిస్తే ప్రజాస్వామ్యంలో కుదరదన్నారు.

స్కూళ్ల నిర్వహణలో నిబంధనలు పాటించాలి



చాగల్లులో కుర్చీలను బహూకరిస్తున్న ప్రైవేటు స్కూళ్ల నిర్వాహకులు

చాగల్లు: ప్రభుత్వ నిబంధనలను ప్రైవేట్ పాఠశాలల నిర్వాహకులు విధిగా పాటించాలని ఎంఈవోలు యు.గురునాథం, జి.శుభాకర్ ఆదేశించారు. మండలంలోని ప్రైవేట్ యాజమాన్యంలోని వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశాన్ని సోమవారం స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో నిర్వహించారు. సమావేశంలో వారిద్దరూ మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లను పేద విద్యార్థులకు ప్రభుత్వం కేటాయించిందన్నారు. తూచ తప్పకుండా ఈ ఆదేశాలను అమలు చేయాలన్నారు. విద్యార్థుల అందరికీ మంచి అలవాట్లు నేర్పించాలని, పాఠశాల ప్రాంగణం చాలా పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. సెలవు రోజుల్ల పాఠశాలలను తెరవకూడదని ఆదేశించారు. ఈ సందర్భంగా మండల ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యం మండల విద్యావనరుల కేంద్రానికి 40 కుర్చీలను బహూకరించారు.

మెరిట్ విద్యార్థులకు 50 శాతం ఫీజు రాయితీ

నల్లజర్ల ఎస్ఆర్ కే కళాశాల చైర్మన్ కంఠమణి వసుంధరాదేవి



మెరిట్ విద్యార్థిలను అభినందిస్తున్న నల్లజర్ల ఎస్ఆర్‌కే కళాశాల చైర్మన్, బోర్డు సభ్యులు

నల్లజర్ల: గతేడాది నిర్వహించిన ఐపీఈ బోర్డు పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు తమ కళాశాలలో 50 శాతం ఫీజు రాయితీ కల్పిస్తూ యాజమాన్యం నిర్ణయం తీసుకున్నట్టు నల్లజర్లలోని ఎస్ఆర్‌కే కళాశాల చైర్మన్ కంఠమణి వసుంధరాదేవి తెలిపారు. కళాశాలలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో మెరిట్ విద్యార్థులకు మెమెంటోలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. రాష్ట్రస్థాయి క్రికెట్ మీట్‌కు ఎంపికైన ఈ.సాయి జ్యోత్స్న, జిల్లాస్థాయి 100 మీటర్లు రన్నింగ్ పోటీలకు ఎంపికైన కె.సంజనలను కళాశాల పాలకవర్గ సభ్యులు అభినందించారు. కార్యక్రమంలో సెక్రటరీ, కరస్పాండెంట్ గన్నమని దొరయ్య, పాలకవర్గ సభ్యులు సుంకర సుబ్బారావు, కొడాలి ఆంజనేయ చౌదరి, కొఠారు గాంధీ, కోరా కన్నయ్య, దుగ్గిన లీలాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దేదీప్యమానంగా గణనాథుని శోభాయాత్ర



గణనాథుని శోభాయాత్రకు తరలి వచ్చిన భక్తులతో కిక్కిరిసిన కొవ్వూరు మెయిన్ రోడ్డు



కొవ్వూరులో సాగుతున్న మెరకవీధి వినాయకుని శోభాయాత్ర

కొవ్వూరు: పట్టణంలోని మెరకవీధిలో కొలువుదీరిన వినాయకుని శోభాయాత్ర సోమవారం సాయంత్రం దేదీప్యమానంగా సాగింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన వేలాది మంది భక్తులతో పట్టణ వీధుల్లో రద్దీ నెలకొంది. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో స్వామి వారిని ఉంచి పట్టణ వీధుల్లో వైభవంగా ఊరేగించారు. బాణసంచా కాలుస్తూ, యువకులు, మహిళలు నృత్యాలు చేస్తూ ఊరేగింపు ఆద్యంతం అట్టహాసంగా సాగింది. మెరక వీధిలోని మూడు రోడ్ల జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై స్వామివారిని ఉంచి బాణసంచా కాలుస్తూ, రంగు రంగుల విద్యుత్ కాంతుల మధ్య, పూలు చ ల్లుతూ ఘనంగా వీడ్కోలు పలికారు. సోమవారం మధ్యాహ్నం శిబిరం వద్ద భారీఎత్తున అన్న సమారాధన నిర్వహించారు. రౌండ్ రామాలయం యూత్ ఆధ్వర్యంలో సాగిన ఈ శోభాయాత్రను తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులతో కొవ్వూరు పట్టణం కళకళలాడింది.

అనుమతి లేకుండా ఎర్రమట్టి తవ్వకాలు



సగ్గొండ ఫ్యాక్టరీకి వెళ్లే మార్గంలో గ్రావెల్ తవ్వుతున్న ప్రాంతం

తాళ్లపూడి: అనుమతి లేకుండా మండలం నుంచి కొందరు ఎర్రమట్టిని తవ్వి తరలిస్తున్నారని తాళ్లపూడికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు నామన బుజ్జి ఆరోపించారు. దీనిపై సోమవారం తాళ్లపూడి తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినట్టు ఆయన తెలిపారు. గజ్జరం నుంచి, గోపవరం నుంచి సగ్గొండ ఫ్యాక్టరీకి వెళ్లే మార్గంలో నుంచి గ్రావెల్ మట్టిని అక్రమంగా తరలిస్తున్నారని ఆయన ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

విగ్రహాల తొలగింపు ఫిర్యాదుపై విచారణ



వేగేశ్వరపురంలోని కేఎస్సార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో విచారణ చేస్తున్న డీవైఈవో రామన్నదొర

తాళ్లపూడి: మండలంలోని వేగేశ్వరపురం కేఎస్సార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లోని విగ్రహాలను తొలగించాలంటూ అందిన ఫిర్యాదులపై ఇరువర్గాల వారి నుంచీ వివరాలు సేకరించామని, ఆ నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని విచారణాధికారి, కొయ్యలగూడెం డీవైఈవో రామన్నదొర తెలిపారు. ఈ హైస్కూల్ ముందు భాగంలో ఇరువైపులా ఏర్పాటు చేసిన అల్లూరి సీతారామరాజు, ఝాన్సీలక్ష్మీబాయి విగ్రహాలను తొలగించాలని పూర్వ విద్యార్థులైన అంబటి కృష్ణమూర్తి, కె.వెంకటేష్, ఏవీఎస్ ప్రసాద్ తదితరులు ఫిర్యాదు చేశారన్నారు. దీనిపై సోమవారం రామన్నదొర ఆ పాఠశాలకు వచ్చి విచారణ జరిపారు. కాగా ఆ విగ్రహాలను ఏర్పాటు చేసిన వర్గం నుంచి కూడా ఆయన వివరాలు సేకరించారు. పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలోనే సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశురామారావు తదితరులు స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలను ఏర్పాటు చేసినట్టు ఆ వర్గం తెలిపింది. ఇరువర్గాల వారి వద్ద నుంచి డీవైఈవో రామన్నదొర స్టేట్‌మెంట్లు తీసుకున్నారు. పాఠశాల విద్యార్థుల నుంచి కూడా ఆయన వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశురామారావు మాట్లాడుతూ పాఠశాల్లోని విగ్రహాలపై కూడా రాజకీయం చేయడం సరికాదన్నారు. టీడీపీ వర్గం నాయకులకు ఫిర్యాదులు చేయడం అవాటుగా మారిందన్నారు. విగ్రహాలను తొలగిస్తే సహించేది లేదన్నారు.ఎంఈఓ సీహెచ్ బాలామణి, సీహెచ్ నెహ్రూజీ, విగ్రహాలను అందజేసిన లింగాల రామతీర్థ, వైఎస్సార్ సీపీ, టీడీపీ నాయకులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

నెల రోజుల్లో పట్టణంలో మినీ స్టేడియం

- మంత్రి కందుల దుర్గేష్
- నియోజకవర్గ స్థాయి క్రీడాపోటీల ప్రారంభం



నిడదవోలులో క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న మంత్రి కందుల దుర్గేష్

నిడదవోలు: నెల రోజుల్లో నిడదవోలు పట్టణంలో మినీ స్టేడియం ఏర్పాటు చేయబోతున్నామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ ప్రకటించారు. అండర్-14, అండర్-17 నియోజకవర్గ స్థాయి బాలబాలికల ఎంపిక పోటీలను సోమవారం ఆయన పట్టణంలోని ప్రభుత్వ హైస్కూల్ క్రీడా మైదానంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ కొద్దిసేపు క్రీడాకారులతో కలసి ఆటలాడి వారిని ఉత్సాహ పరిచారు. అనంతరం ఉపాధ్యాయులు మంత్రి దుర్గేష్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈవోలు కేఎస్‌వీ గణేశ్, పి.గురుమూర్తి, హెచ్‌ఎం గురునాథ్, విద్యాకమిటీ చైర్మన్ సూరబ్, జనసేన పట్టణశాఖ అధ్యక్షుడు రంగా రమేష్, బీజేపీ మండలశాఖ అధ్యక్షుడు మాట్ల వెంకటదుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ప్రభుత్వాస్పత్రిలో సోమవారం నిర్వహించిన వైద్య శిబిరాన్ని మంత్రి దుర్గేష్ పరిశీలించారు. వైద్యులతో మాట్లాడి పేదలకు అందుతున్న వైద్య సేవల గురించి తెలుసుకున్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎఫ్ఏ ఫయాజ్ అన్సారీ, పీహెచ్‌సీ వైద్యురాలు పద్మశ్రీ తదితరులు పాల్గొన్నారు.

దీపావళి నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్లు

నిడదవోలు రూరల్: కూటమి ప్రభుత్వం దీపావళి నుంచి ప్రజలకు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తుందని రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. మండలంలోని డి.ముప్పవరంలో సోమవారం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమానికి మంత్రి దుర్గేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 100 రోజుల్లో ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించే కరపత్రాలను అందజేశారు. ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, సర్పంచ్ నాగిరెడ్డి నాగదేవి పాల్గొన్నారు.









